# పిచ్చుక గూడు

అశోక్‌నగర్ కాలనీలో ప్రభుత్వంవారు కట్టించిన 2/ఆర్. టి. 264 ఇంట్లో చిన్నగా అమర్చుకున్న పెరట్లో అరటి చెట్టుకింద కుర్చీ వేసుకుని కూర్చున్నాడు సిద్ధార్థ. రోజూ పొద్దున్నా సాయంత్రం ఒక గంటసేపు అలా ఆ చెట్టుకింద కూర్చుని ఏయే చెట్టుకి ఎన్ని కాయలున్నాయో, ఏయే చెట్టుకి ఎన్ని పిందెలున్నాయో, ఆకుకూర మొక్కలైతే ఎన్ని ఆకులున్నాయో కూడా లెక్క పెట్టుకుంటాడు. పొద్దున్న పెట్టిన లెక్క ప్రకారం సాయంత్రానికి అన్నీ వున్నాయో లేదోనని మళ్ళీ లెక్కపెట్టుకుంటాడు ఆఫీసు నుంచి తిరిగిరాగానే. "పెరట్లో కూరలమొక్కలు వేసి, ఇంటిముందు చక్కటి గులాబీలూ, చామంతులూ వేద్దామండీ!" అన్న భార్య కుసుమ మాటల్ని తోసిపుచ్చుతూ, "గులాబీలూ, చామంతులూ ఎందుకే? ఎన్నాళ్ళు కొయ్యకుండా చెట్టుమీద వుంచినా వాడిపోతాయి, రాలిపోతాయి అదే కూరల మొక్కలు వేసుకుంటే మనం బయట కూరగాయలు కొనుక్కోనక్కరలేదు" అనేవాడు. అరటిచెట్టు గెల వేసింది మొదలు అరటిపువ్వూ, అరటికాయా, అరటి దూటా ఇలా సర్వం అరటితోటే ఒక పది రోజులు గడిచిపోయేవి. తోటకూర కొస్తే అదే కూరా, అదే పులుసూ, రోజూ అదే. కుసుమ విసుగొస్తుందన్నా వినిపించుకునేవాడు కాదు సిద్ధార్థ. ఆయన సిద్ధాంతమల్లా ప్రాణం మీదకొస్తే తప్ప పైసా ఖర్చు పెట్టకూడదు. డబ్బంతా జమ చెయ్యాలి. లక్షాధికారీ, కోటీశ్వరుడు అనిపించు కోవాలి.

ఏ పెళ్ళి పేరంటానికయినా తప్పనిసరిగా భార్యతో సహా అతను హాజరవుతాడు. "ఏమిటండీ ఇది? వాళ్ళెవరో నాకు తెలీదు. నేనొస్తే ఏం బాగుంటుంది. మీతోటి వాళ్ళ భార్యలు రానప్పుడు నేను మాత్రం ఎందుకు రావాలి?" అని కుసుమ ప్రశ్నిస్తే, నవ్వుతూ "పిచ్చిదానా! నువ్వు రావడంవల్ల

బెనిఫిట్లు చెప్తావిను. నెంబర్ వన్, పాపం ఆవిడ బెట్టుచెయ్యకుండా, మొహ మాటపడకుండా అన్ని చోట్లకీ వస్తుంది అనే సర్టిఫికేటు సీకొస్తుంది. నెంబర్ టూ, ఆ పూటకి మనకయ్యే బియ్యం, కూరగాయలూ వగైరా ఖర్చు మనకి మిగులుతుంది" అనేవాడు. "మరీ మీరింత పిసినిగొట్టు మనిషి అనుకోలేదు". అనేది కుసుమ చీదరింపుగా.

సిద్ధార్థ నవ్వుతూ "మై డార్లింగ్, ఎవ్విరి డ్రాప్ మేక్స్ ఏన్ ఓషన్. మన ఆస్తి నానాటికి వర్ధిల్లుతూ పోవాలనేదే నా కోరిక" అనేవాడు.

అతనికి ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థంకాక మాట్లాడక ఊరు కునేది కుసుమ. అంతేకాదు, ప్రతి చిన్న పండగకీ అత్తవారింటికెళ్ళి వారాల కొద్దీ వుండిపోయేవాడు. కుసుమ తల్లిదండ్రులకు కొంచెం ఇబ్బందిగా అని పించినా మాట్లాడక ఊరుకునేవారు కూతురు మొహం చూసి.

పెళ్ళయి ఆర్నెల్లయినా కుసుమ కడుపుతో వుండకపోయేసరికి కంగారు పడిపోయాడు సిద్ధార్థ. ఎందుకోకాదు, కడుపుతో వుంటే ఏడోనెలనుంచి, పాపకి అయిదోనెల వచ్చేదాకా కుసుమని పుట్టింట్లోవుంచితే తనూ అక్కడే మకాం పెడితే, నెలకి ఇంటికయ్యే ఖర్చుకూడా ఖాతాలో వేసుకుని జమ చేసుకో వచ్చునని!

ఆర్నెల్లు దాటేటప్పటికి డాక్టరు దగ్గరికెళ్దామని నానాగోలా చేశాడు సిద్ధార్థ. కుసుమ బెంగ పెట్టుకుంది. కాని సంతానలక్ష్మి కటాక్షం వల్ల కుసుమ నెల తప్పిందని సిద్ధార్థ మురిసిపోయాడు

కుసుమని కాలు కింద పెట్టనిచ్చేవాడు కాదు. "అబ్బ, మీకు పిల్లలంటే ఎంత ఇష్టమండీ! మన పెళ్ళయి ఆర్నెల్లయినా ఎన్నడూ నన్నింతగా గారాబం చెయ్యలేదు. నెల తప్పానని తెలిసినప్పటినుంచీ మీ అభిమానంతో నన్ను ముంచెత్తేస్తున్నారు" అంది కుసుమ సిద్ధార్థ గుండెలమీద తల ఆనిస్తూ.

"కరెక్ట్. నాకు పిల్లలంటే ప్రాణం. పదిమందిని కంటాను. వారే నా కంటిజ్యోతులు" ఆనందం కళ్ళల్లో తాండవం చేస్తుంటే, కుసుమని గుండెలకి హత్తుకుంటూ అన్నాడు సిద్ధార్థ.

''చాల్లెండి. ఎవరైనా వింటే నవ్విపోతారు. పదిమందిని కంటార్ట. ఇంకా నయం, వందమందిని కంటాననలేదు కౌరవ సైన్యంలాగా!" నవ్వుతూనే అతని కళ్ళల్లోకి చిలిపిగా చూస్తూ అంది.

''ధృతరాష్ట్రుడెంత అదృష్టవంతుడు. వందమందిలో అందరూ మొగ పిల్లలే. మైగాడ్!" ఆశ్చర్యంతో ఆలోచనలతో ఎటో తేలిపోతున్న భర్తనిచూసి "ఏమయిందండి! యేమిటాలోచిస్తున్నారు?" అంటూ భుజాలు పట్టి కుదిపేసింది కుసుమ. "ఏమీలేదు ధృతరాష్టుడికి అందరూ మొగపిల్లలే. ఎంత అదృష్టం అంటున్నాను" అన్నాడు.

ఆశ్చర్యంగా అతనివైపు చూసింది కుసుమ.

అతను ఊహాలోకంలో విహరిస్తున్నాడు.

"ఏమండి! మీకు ఆడపిల్లలు ఇష్టంలేదా?" అడిగింది. ఉలిక్కిపడ్డాడు సిద్ధార్థ. తన అరచేతిలో ఆమె నోరుమూస్తూ "అలాంటి మాటలనకు. నేను తట్టుకోలేను. నాకు మొగపిల్లలే కావాలి" అన్నాడు. మరింత ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవిచేసి నోరు తెరుచుకుని అతనికేసి చూసింది కుసుమ.

"ఆడపిల్లలంటే....మై గాడ్! నాకసహ్యం. పుట్టినప్పటినుంచీ, ఇల్లు దోచుకుపోవడం తప్పితే, మరేమీలేదు. కొబ్బరి నూనె దగ్గరనుంచి, కుంకుడు కాయల దగ్గరనుంచి, కట్నాలూ పెళ్ళిళ్లూ, పురుళ్లూ పుణ్యాలూ అన్నీ ఖర్చులే. ఆడపిల్లల తండ్రికి ఎప్పుడూ మైనస్ బడ్జెటే ఆడపిల్లని లక్ష్మి అని ఎందు కన్నారోగాని, అసలు లక్ష్మిని తెచ్చేవాడు, ఉద్యోగం చేసి డబ్బు సంపా దించేది, పెళ్ళి చేసుకుని కట్నం రూపంలో డబ్బు తెచ్చేది మగపిల్లాడు కదూ! లక్ష్మి ఉపమానం మొగపిల్లలకుండాలి? ఆడపిల్లలు లక్ష్మి ఎలా అవుతారు? మొగపిల్లల తండ్రికి ఎప్పుడు ప్లెస్ బడ్జెట్టే" గుక్క తిప్పుకోకుండా మనసులోని మాట ఇంత ఖచ్చితంగా చెబుతూన్న భర్తని చూస్తూవుంటే ఆశ్చర్యమూ, కోపమూ అన్నీ ముంచుకొచ్చాయ్ అంతకన్నా అసహ్యం రెట్టింపయింది.

"అలా మైనసూ, ప్లెస్సూ అనుకుంటే తనకి తల్లివుండేదికాదు, లక్షరూపా యల కట్నమిచ్చి తనూ వుండేదికాదు. పెళ్ళిచేసుకోవడం, పిల్లల్ని కనడం, అంతా వ్యాపారమేనా? బిడ్డని పెంచడానికయ్యే, కొబ్బరినూనె ఖర్చూ, కుంకుడు కాయల ఖర్చూ కూడా జమలోకి రాసుకునేవాళ్ళని ఏమనాలి? వాళ్ళు మనుషులు కాదు, రాక్షసులు! ఇటువంటి సంకుచితమైన మనస్సు కలవాడా తన భర్త?" ఆమాటే నిలదీసి అడగాలనుకుంది. కాని పెదవివిప్పలేకపోయింది. సిద్ధార్థ ఆమెని గట్టిగా కౌగిలించుకుని తన బాహువుల్లో నలిపేస్తూ, ముద్దుల్లో

ముంచేస్తూ, "కుసుమా! ఎప్పుడూ నువ్వు మొగపిల్లాడి గురించే కలలు కను. మొగపిల్లాణ్ణే కను. పొరపాటున కూడా ఆడపిల్ల గురించి ఆలోచించకు. తథాస్తు బ్రాహ్మలు తథాస్తు అంటే మనపని గోవిందా....గోవింద. నీకేం తినాలనుందో చెప్పు. నేను చేసి పెట్టలేను కదా! కొన్ని వస్తువులు మంచివి కావు ముఖ్యంగా ఈ పరిస్థితుల్లో కడుపులోని బిడ్డకి కూడా మంచివి కావు. మా అమ్మని అనకాపల్లి నుంచి పిలిపించాలంటే అనవసరమైన రైలు ఖర్చు. అందుకని చిటికెలో వెళ్ళి మీ అమ్మగారింటికి, నీకు కావలసినవి పట్టుకొస్తాను" అన్నాడు.

కోపంతో కుసుమ మొహం జేవురించింది.

"సిగ్గుపడుతున్నావా? మొహం చూడు ఎలా ఎర్రగా అయిపోయిందో" అంటూ మొహం మీద పడుతూన్న తూనీగలాంటి ముంగురులను సరిచేశాడు సిద్ధార్థ.

మాట్లాడకుండా తలవంచుకుంది కుసుమ.

* * *

సిద్ధార్థ మొగపిల్లవాడి గురించి మాట్లాడినప్పుడల్లా కుసుమ మనసు ఆడపిల్లల గురించి ఆలోచించేది. నిజానికి కుసుమకి ఆడపిల్లలంటేనే ఇష్టం. రక రకాల అందమైన ఫ్రాక్స్ వెయ్యోచ్చును. అందమైన పిన్నులూ, రిబ్బన్లూ, నగలూ.నట్టా ఎన్నో వెయ్యొచ్చును రకరకాల హెయిర్ స్టయిల్స్.వెయ్యొచ్చును. వాళ్ళ గుజ్జనగూళ్ళ ఆటలూ, బొమ్మల పెళ్ళిళ్లూ, బొమ్మల కొలువులూ, గొబ్బెమ్మల పూజలూ - ఒకటా ఎన్నో సరదాలు. కలకలలాడుతూ, కిలకిల నవ్వుతూ, ఇంట్లో తిరుగుతూ వుంటే ఆ యిల్లు ఎంత ఆనందంగా వుంటుంది! అస్తమానం "అమ్మా" "నాన్నా" అంటూ ఇంటిని అంటిపెట్టుకొని కొంగుచ్చుకు తిరిగే ఆడపిల్లలనా సిద్ధార్థ అసహ్యించుకునేది? అనురాగవల్లులుగా, అపరంజి బొమ్మలుగా ఆనందాన్నందించే ఆడపిల్లలు (ఆడపడుచులు) నాసిద్ధార్థ వద్దను కునేది?....కుసుమ కళ్ళనిండా నీళ్ళు నిండాయి. "ఆడపిల్లలేని ఇల్లు విగ్రహం లేని గుడిలా వుండదూ?'' కన్నీళ్ళు జలజలా రాలాయి చెంపల మీదుగా. ఎప్పుడొచ్చాడో సిద్ధార్థ. ''కుసుమా! నీ కోసం ఏం తెచ్చానో చూడు" అంటూ అరుస్తూ పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ లోపలికొచ్చాడు.

గబా గబా కళ్ళు తుడుచుకుని, అతని వైపు చూసింది నవ్వుతూ.

పాంటు జేబులోనుంచి ఒక చిన్న పొట్లాన్ని తీసేడు. "కుసుమా! చూడు. దూద్ పేడా, కాజూ పకోడి. ఇవ్వాళ మా ఆఫీసులో ఒకతను రిటైరయి వెళ్ళిపోతూవుంటే, పార్టీ ఇచ్చారు. అందరూ అక్కడే తినేశారు. నేను మాత్రం నీ కోసం దాచిపెట్టి, కాదు కాదు, నీ బొజ్జలో వున్న మన బాబిగాడి కోసం దాచిపెట్టి పట్టుకొచ్చాను. ఏదీ 'ఆ' అను. నీ నోట్లోంచి బుజ్జిగాడికి తినిపిస్తాను" అంటూ బలవంతంగా ఆమె నోట్లోకి కుక్కుతూ వుంటే, ఆ కక్కుర్తితనానికీ, వెకిలివేషానికీ విసుగనిపించినా నోరు తెరవక తప్పలేదు. 'మీరు తినిపిస్తున్నది బుజ్జిగాడికికాదు, బుజ్జెమ్మకేమో' అనుకోగానే నవ్వొచ్చింది కుసుమకి.

భార్య చాలా సంతోషిస్తోందనుకుని మురిసిపోతున్న సిద్ధార్థ మీద జాలీ, కోపం అన్నీ ఒక్కసారిగా ముంచుకొచ్చినా ఏమీ చెయ్యలేని, చెప్పలేని తన అసహాయస్థితికి తనే జాలిపడుతూ తలపంచుకుంది కుసుమ

వర్షఋతువు మారి హేమంతం మొదలయింది. వరుణుడి చలువతో పులకించిన పుడమి పచ్చని పచ్చికలను కప్పుకుని, చక్కని పూగుత్తులతో అలంకరించుకుని పళ్ళూ ఫలాలతో తులుకుతూ వుంది.

కుసుమ కూడా కొత్త అందాలతో, నానాటికీ పెరుగుతున్న పొట్టనీ, పొట్టలో పొదుస్తున్న తన ప్రతిరూపాన్నీ చూసి ముచ్చటపడిపోతోంది. ఎర్రపట్టుచీరలో వగడపుగుట్టలా నిగనిగలాడిపోతూ చేతులనిండా ఇంద్రధనుస్సులా ధగధగ మెరిసే గాజులు వేసుకుని, మల్లెల గుబాళింపులో మత్తుగా వున్న మత్తేభంలా నడుస్తున్న సీమంతపు పెళ్ళికూతురు కుసుమని చూసి ముచ్చటగా "సుపుత్ర ప్రాప్తిరస్తూ" అని ముత్తైదువలు ఆశీర్వచనంతో అక్షింతలు జల్లుతూవుంటే, అనిర్వచనీయమైన ఆనందంలో తేలిపోతున్న కుసుమ, ఒక్కసారి మేలుకున్నట్టుగా ఉలిక్కిపడి అటూ ఇటూ చూసి ముసి ముసిగా నవ్వింది. అతివలుచేసే ఈ ముచ్చటైన కార్యక్రమంలో కూడా అందరూ 'సుపుత్ర ప్రాప్తిరస్తు' అనేకాని, 'సుపుత్రికా ప్రాప్తిరస్తు' అనరేం? అనుకుంది. ఆడవాళ్ళే ఆడపిల్ల కావాలని కోరుకోవడంలేదు. ఎంత విచిత్రం అనుకుంది. బాధపడింది. దూరంనుంచి తననే చూస్తున్న భర్తని క్రీగంట చూసింది. అతడు ఎవరు ఆశీర్వదిస్తూన్నా తను కూడా మనసులో 'పుత్ర ప్రాప్తిరస్తు' అంటూ పెదవులు మెదపడం చూసి జాలిగా నవ్వుకుంది. అత్త

వారింట్లో అన్ని భోగాలతోనూ కాలం గడుపుతూ మరిన్ని తియ్యని కలలు కంటూ ఊహల్లో మునిగిపోతున్నాడు సిద్ధార్థ.

*　　*　　*

ఆ రోజు సిద్ధార్థ కళ్ళు తెరిచి చూసేసరికి ఇంట్లో ఎవ్వరూ లేరు. కంగారుగా లేచి ఇల్లంతా కలయచూశాడు. వరండాలో పరంధామయ్యగారు చుట్ట కాల్చుకుంటూ కనిపించారు.

"మామగారూ! కుసుమ కనిపించదేం?" అడిగాడు కంగారుగా.

"అమ్మాయికి నొప్పులొస్తే ఆసుపత్రికి తీసుకెళ్లారు బాబు సుధామ వెంట వెళ్లాడు" అన్నారు నిదానంగా. గబగబా కాళ్ళకి చెప్పులేసుకుని పరుగెడుతున్న అల్లుడిగారిని చెయ్యి పట్టుకుని ఆపి "చూడు బాబూ, నీ కంగారు, బాధా నాకు తెలుసు. ఇందులో భయపడవలసినదేదీ లేదు. మీ అత్తగారి ప్రతి కాన్పు అయిదు నిమిషాల్లో అయిపోయేది. ఇలా వెళ్ళి ఆసుపత్రికి అలా వొచ్చేసేది. అందుకే అర డజను మందిని కన్నది. ఆఫ్‌కోర్స్ నలుగురే మిగిలారనుకో. ఇహ పోతే...." అని మొదలెట్టారు బాబోయ్ సుత్తి. పోనీ కాస్సేపు భరిద్దామనుకుంటే ప్రొలాంగ్‌డ్ స్తుతి కొట్టేలాగున్నాడు. ఎలా వదిలించుకోవడం? అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు సిద్ధార్థ.

ఇబ్బందిగా మొహంపెట్టి, "కుసుమకెలాగుందో ఏమిటో? యేం పిల్ల పుట్టిందో - కాదు కాదు పిల్లాడు పుట్టాడో" అన్నాడు కంగారుగా మాటలు తడబడుతూ.

"ఏంటయ్యా నీ కంగారు? లోకంలో ఎవరూ కనడంలేదా ఏంటి? 'కడుపుతో వున్నమ్మ కనకమానుతుందా? వొండుకున్నమ్మ తినకమానుతుందా' అనీ, నీ భార్య కంటుందో కనేసిందో ఈపాటికి. ఏదో ఒక పిల్ల పుడుతుంది. మొగపిల్లాడు కాకపోతే ఆడపిల్ల. ఈ రెండూకాక ఇంకేపిల్లో పుట్టదు కదా! అహ్హహ్హహ్హా" అంటూ తన జోక్‌కి తనే నవ్వాడు పెద్దగా ఆయన. సిద్ధార్థ ఉలిక్కిపడ్డాడు చివరి మాటలు విని. స్త్రైస్నూ మైస్నూ కాకుండా ఆ మూడో జాతిని ఏమనాలి? బాబోయ్ ఒకవేళ అలా పుడితే? ఒళ్ళు చెమటలు పట్టింది. కాళ్ళు వణికాయి. నిలవలేకపోతున్నాడు గబగబా పరుగులాంటి నడక ప్రారంభించాడు సిద్ధార్థ.

"ఉండవయ్యా! ఏమిటా చెమటలూ నువ్వూనూ? కంటున్నది నీ పెళ్ళామా నువ్వా? అలా వణికిపోతున్నావ్?" అంటూ మళ్ళీ వెళ్ళనియ్యకుండా చెయ్యిపట్టుకుని ఆపేశారు పరంధామయ్యగారు.

అతణ్ణి చూస్తూ వుంటే, రావణాసురుడిలాగా, కీచకుడిలాగా, కంసుడిలాగా రకరకాల రాక్షసులు జ్ఞాపకమొచ్చారు సిద్ధార్థకి మామగారి హోదాలో వుండబట్టి పరంధామయ్యగారు బతికిపోయారు కానీ, లేకపోతే మరొకరయితే తుపాకితో తల బద్దలు కొట్టేసి వుండేవాడు సిద్ధార్థ. అంతలో కుసుమ చెల్లెలు లకుమ "బావగారు ఇదిగో కాఫీ'' అంటూ కాఫీ కప్పుతో ప్రత్యక్షమయింది.

"నేనింకా పళ్ళు తోముకోలేదు'' అన్నాడు పళ్ళు పటపటా కొరుకుతూ.

"అదేమిటోయ్ చెప్పనేలేదు. నువ్వింకా పళ్ళు తోముకోలేదా? నాది రెండోసారి కాఫీ కూడా అయిపోయింది'' అన్నారు మీసాలు మెలేస్తు చుట్ట నోట్లో పెట్టుకుని గట్టిగా దమ్ములాగి, పరంధామయ్యగారు.

"తాగుతారు తాగుతారు మీకేం? రెండుసార్లు కాకపోతే ఇరవైసార్లు తాగుతారు ఇదే మీ పెళ్ళామయితే, నాలాగా ఆడపిల్ల పుడుతుందేమోనన్న బాధ మీకుంటే, మంచినీళ్ళు కూడా ముట్టుకునుండేవారుకాదు. ఒడ్డు చేరుకున్నాక కబుర్లెన్నైనా చెప్తారు. నా సామిరంగా నాకు పదిమంది కొడుకులు పుట్టి ఒక్కొక్కడికి అయిదు లక్షల కట్నం తీసుకుంటే యాభై లక్షలు బ్యాంకులో వేసి, నేనూ మీలాగా చుట్ట కాలుస్తు, హాయిగా వొచ్చే పోయేవాళ్ళతో కబుర్లు చెబుతూ కాలుమీద కాలేసుకుని కూర్చునేవాణ్ణి" అనుకుంటూనుంచున్న సిద్ధార్థని చూసి ''బావగారూ! ఏమిటా పరధ్యానం? పదండి, మొహం కడుక్కోండి'' అంది లకుమ. తిరిగి చూడకుండా లోపలి కెళ్ళిపోయాడు సిద్ధార్థ కోపాన్నంతా దిగమింగుకుంటూ. అతని ముఖ కవళికలు చూసి పక్కున నవ్వింది లకుమ.

గబగబా పళ్ళుతోముకునొచ్చి, కాఫీ తాగేసి ''నేను ఆసుపత్రికి వెళ్ళొస్తాను" అంటూ బయటికొచ్చిన సిద్ధార్థకి ఎదురయ్యాడు మనోజ్.

"మనోజ్! డెలివరీ అయిందా?" కిషోర్ చేతులు పట్టుకుంటూ అడిగాడు.

"ఓ....అయింది" అన్నాడు మనోజ్ ముక్తసరిగా.

"మొగపిల్లాడేనా?" ఆత్రంగా అడుగుతున్న సిద్ధార్థని చూస్తే మనోజ్‌కి ఏడిపించాలనిపించింది.

"ఏమో, నాకు తెలీదు" అన్నాడు మనోజ్.

"ఆసుపత్రికి వెళ్ళిన వాడివి, డెలివరీ అయిందని తెలిసి యేం పిల్లో అడగవూ? నువ్వు మనిషివేనా?" కోపంతో అరిచాడు సిద్దార్థ. అతని అరుపులకి ఆశ్చర్యపోయారు పరంధామయ్యగారూ, లకుమా, మనోజ్‌లు. నిజం చెప్పెయ్యాలనుకున్నాడు మనోజ్. కానీ అతని కోపానికి కారణం తెలిసీ మనోజ్‌కి కొంచెంసేపు ఏడిపించాలన్న చిలిపి బుద్ధి పోలేదు.

''ఆడపిల్ల అనుకుంటాను'' అన్నాడు మెల్లగా.

''మై గాడ్!'' అంటూ కుప్పలా కూలిపోతూ, పక్కనున్న కుర్చీలో కూలబడ్డాడు సిద్దార్థ. ''ఏం బావా,ఏం జరిగింది? ఎందుకలా అయిపోయారు?" అంటూ కంగారుగా అడుగుతున్న మాటలు సిద్దార్థ చెవికి సోకలేదు. అతని కళ్ళ ముందు పెద్ద ''మైనస్'' అగాధంలా కనబడుతోంది భయంకరంగా.

''బావగారూ! బావగారూ!'' లకుమ చెయ్యిమీద కొడుతూ పిలుస్తోంది.

''అల్లుడూ! ఏమైందయ్యా నీకు?'' అంటూ దగ్గరికొచ్చి భుజం మీద చెయ్యేశారు పరంధామయ్యగారు.

''నో.... నో.... ఐ.... కాంట్.... బిలీవిట్.... నాకు ఆడపిల్ల పుట్టదు, పుట్టకూడదు'' అంటూ పిచ్చివాడిలా అరిచాడు సిద్ధార్థ. అంతవరకూ లైట్‌గా నవ్వుల పువ్వులు విరజిమ్మినట్టుగా వున్న వాతావరణం గంభీరంగా మారిపోయింది. అందరి మొహాలలోనూ ఒకరకమైన సీరియస్‌నెస్ చోటు చేసుకుంది.

లకుమకి మాత్రం ''ఆడపిల్లా!'' అంటూ అంత బాధపడిపోవడం అసలు నచ్చలేదు కోపంతో ''బావా! ఆడపిల్లా? అంటూ అలా ఇదై పోతావేమిటి? ఆడపిల్ల పుడితే లక్ష్మీదేవి అంటారు. అందులోనూ, ఇవాళ శుక్రవారం'' అంది కళ్ళు గుండ్రంగా తిప్పుతూ.

''చాల్లే! నీ కింకా పెళ్ళే కాలేదు. శాస్త్రాలు చెబుతున్నావ్ ఆరిందలాగా'' అంటూ లేచి అటూ ఇటూ పచార్లు చేస్తున్న సిద్దార్థ దృష్టి రిక్షా దిగుతున్న అత్తగారిమీద పడింది.

"కాస్సేపు పక్కింటి ఆంటీ వేదవతిని అక్కడే వుండమని చెప్పొచ్చాను. నేను గబ గబా స్నానం చేసి, నాలుగు మెతుకులు తినేసి పదింటికల్లా

వెళ్ళిపోతాను. పాపం, అంతదాకా అవిడ వుంటానంది కుసుమ దగ్గర" అంటూ దండకంలా విషయాలన్నీ వల్లిస్తున్న అత్తగారు అసలు విషయం చెప్పక పోవడంతో ఇబ్బందిగా మొహంపెట్టి ఆమెకేసి చూస్తూ నుంచున్నాడు సిద్ధార్థ.

''పెద్ద కళ్ళు....చిన్న నోరు ...ఎంతబాగున్నాడో!'' అంది.

ఇంక పట్టలేకపోయాడు సిద్ధార్థ. ''అత్తగారూ! పుట్టింది మొగపిల్లాడేనా?'' అనడిగాడు.

''అవును'' అంది ఆమె.

మనోజ్ వైపు మింగేసేలా చూస్తూ, గబగబా బయటికి నడుస్తూ, "అత్తగారూ, నేను వెళ్ళి చూసొస్తాను" అంటూ ఇంక ఎవరి సమాధానంకోసమూ ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు సిద్ధార్థ.

భర్తని చూసి చిరునవ్వు నవ్వింది కుసుమ. సిద్ధార్థ చిన్నగా నవ్వి, వెంటనే ఉయ్యాల దగ్గరికెళ్ళి రగ్గు కప్పి పడుకోబెట్టిన బేబిని రగ్గు తొలగించి చూశాడు తృప్తిగా నిట్టూర్చాడు.

భర్త ఆందోళన గ్రహించిన కుసుమ "మీరే నెగ్గారులెండి" అంది నవ్వుతూ. తృప్తిగా నవ్వాడు సిద్ధార్థ. అతని కళ్ళముందు అయిదులక్షల నోట్ల కట్టలు నాట్యం చేశాయి. అప్పుడే లక్షాధికారి అయిపోయినట్టుగా ఫీలయ్యాడు సిద్ధార్థ. ''భగవంతుడి దయవల్ల ఇలాగే ప్రతీసారి నాకు మొగపిల్లాడే పుడుతూ వుండాలి'' అనుకుంటూ మనసులోనే దేముళ్ళందరికీ దండాలు పెట్టుకున్నాడు.

"ఆదివారానికి అయిదోనెల కూడా దాటబోతుంది. ఇంకా ఎన్నాళ్ళండీ అమ్మా వాళ్ళింట్లో వుండడం? మనింటికిపోదాం" అంది కుసుమ.

''మీ ఇంట్లో కూడా మొహమాటమేముంది?'' జోక్ చేసినట్టు నవ్వాడు.

''మా నాన్నగారికి నేనొక్కర్తినే కూతుర్ని కాదు. ఇంకా లకుమ పెళ్ళి చెయ్యాలి. అయినా, మా అక్క నీలిమ పురిటికి పదిరోజులు ముందు వొచ్చేది. కనగానే నెలలోగా వెళ్ళిపోయేది. నేనిలా నెలల తరబడి వుండిపోవడం నాకు చాలా సిగ్గుగా ఉంది. రేపు మంచిరోజు, వెళ్ళిపోదాం. ఇవ్వాళ అమ్మతో చెప్తాను" అంది కుసుమ.

చేసేదిలేక ''సరే'' నన్నాడు సిద్ధార్థ.

కొత్త క్యాలెండరు వొచ్చేసరికి ఆదిత్యకి సంవత్సరం దాటడమూ, కుసుమ మళ్ళీ నెల తప్పడమూ జరిగింది. ఈసారి దేవుడు సిద్ధార్థ మాట విన్నాడేమో - ఆదిత్యకి తోడుగా ఆనందు పుట్టాడు. సిద్ధార్థ ఆనందానికి అవదుల్లేవు. పదిలక్షల క్యాష్‌బాగ్‌లో వేసినంతగా ఉబ్బిపోయాడు

''కుసుమా! మనం చాలా పొదుపు చెయ్యాలి.''

"ఇప్పుడెందుకండీ? అంత అవసరమొచ్చింది? అయినా మనం పొదుపుగానే ఉంటున్నాంగా?" అడిగింది కుసుమ.

"అవునోయ్! కానీ ఇప్పుడు ఇద్దరు పిల్లలు పుట్టారుగా - అందులోనూ మొగపిల్లలు. వాళ్ళ చదువుల కోసం ఎంతో ఖర్చు పెట్టాల్సొంటుంది? ఒక్కొక్కడు ఇంజనీరో, డాక్టరో అయితే తప్ప కట్నాలు బాగా రావు."

''అబ్బబ్బ ఎప్పుడు చూసినా ఒకటే గోలా? మొగపిల్లాడు పుట్టాలి. వాడు బాగా కట్నంతెచ్చే పెళ్ళి చేసుకోవాలి అంటూ ఎందుకండీ గాలిలో మేడలు? అసలు ఈ పాడు కోరికేమిటి? మీరు సంపాదించుకుని పెద్ద వాళ్లవ్వాలని కోరుకోండి గాని పిల్లలను పెంచి, వాళ్ళమీద వర్తకం చేసుకోవాలనుకోవడం ఏమిటి అసహ్యంగా!" అంది అస్తమానం అతడి మాటలు వినీ వినీ విసుగుపుట్టిన కుసుమ.

పగలబడి నవ్వాడు సిద్ధార్థ.

''ఎందుకలా నవ్వుతారు?'' అడిగింది కుసుమ.

''నీ మాటలు వింటుంటే నవ్వురాక ఏమౌతుంది? జీవితం అంటేనే వ్యాపారం, అంటే ఇచ్చి పుచ్చుకోవడం. ఇల్లు కడితే అద్దె వొస్తుందని ఎదురు చూస్తాం. పొలం కొంటే పంటకోసం ఎదురుచూస్తాం. మొక్క నాటితే ఫలం కోసమో. పుష్పం కోసమో ఆశించే నాటుతాం. ప్రకృతిలో ప్రతి వస్తువునుంచి ఏదో ఒకటి ఆశిస్తూనే వుంటాం. అలాంటిది మనిషి నుంచి మనిషి ఏదీ ఆశించకూడదంటే ఎలా? అది సాధ్యమా?" గొప్ప ఉపన్యాసకుడిలా చెప్పుకుపోయాడు సిద్ధార్థ.

"మనిషి నుంచి మనిషి ఆశించేది డబ్బులూ, వస్తువులూ కావండీ! మమతా, మనసూ, ఆత్మీయతా, అభిమానం" అంది ప్రతి అక్షరాన్ని నొక్కి చెబుతూ.

"నీ గోల నీదే. నీకు చెప్పి లాభం లేదులే" అంటూ అక్కణ్ణించి వెళ్ళి పోయాడు సిద్ధార్థ.

కుసుమ నిట్టూరుస్తూ పనిలో మునిగిపోయింది.

కాలం గడుస్తోంది. ఏడాది తిరగకుండా కుసుమ కడుపు మళ్ళీ పండింది. ''ఇద్దరు పిల్లలు చాలు బాబూ!''అని పోరుపెట్టినా వినలేదు సిద్దార్థ. కుటుంబ నియంత్రణ అంటే అతనికి మంట. కానీ కుసుమ నెల తప్పింది మొదలు ఆమె ప్రసవించే వరకు అతనికి తిండీ నిద్రా సరిగ్గా వుండదు - ఎక్కడ ఆడపిల్ల పుడుతుందోనన్న భయంతో.

''ఈ ఇంత ఇన్నారామ్మగోరూ! ఇస్రితం కాకపోతే కడుపులో బిడ్డ పుట్టకుండానే, ఆడో మొగో సెప్పే పరీచ్చలేవో వొచ్చాయట నా అల్లుడు ఈరిగాడు మా గంగిని తీసుకెళ్ళి సూపిత్తే ఆడకూతురు పుడతదని సెప్పార్ట డాక్టరులు." ఆశ్చర్యంగా కళ్ళు తిప్పుకుంటూ పనిమనిషి నూకాలమ్మ చెబుతున్న మాటలు సిద్ధార్థ. చెవిన పడ్డాయ్. అతని కళ్లు ఆనందంతో మెరిశాయ్. ఆ మర్నాడే కుసుమని డాక్టరు దగ్గరకు తీసుకెళ్లాడు బలిపశువులాగా అతని వెనకే వెళ్ళింది కుసుమ, యుద్ధంలో ఓడిపోయిన వీరుడిలాగా నడుచుకుంటూ. ఆమె భయం నిజమయింది. కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలీగానే అబార్షన్ చెయ్య మన్నాడు సిద్దార్థ డాక్టర్లని ఒప్పించి. కుసుమ ఏది జరగకూడదనుకుందో అదే జరిగింది.

"ఏమండీ! ఆడపిల్ల లక్ష్మండీ! అబార్షన్ ఒద్దండి ప్లీజ్! ఆడపిల్ల అయితే మనిషి కాదా? ఇలా ఆడపిల్లల్ని అసహ్యించుకుంటే మీకు తల్లి ఉండేదికాదు. పెళ్లామూ వుండేదికాదు" అంటూ ఆమె పెట్టిన కేకలు అరణ్యరోదనమే అయింది.

"కుసుమా! ఆడపిల్ల బాధ్యతా, ఖర్చూ మొగపిల్లలకంటే ఎక్కువ కాబట్టి అవి మనమీద పడకూడదనే, మనం సుఖంగా వుండాలనే ఈ పని చేశాను" అన్నాడు. కుసుమ జవాబు చెప్పలేదు. దిండులో ముఖం కప్పుకుని వెక్కివెక్కి ఏడ్చింది.

మరో రెండు క్యాలెండర్లు మారాయి.

ఆదిత్య, ఆనందులని ఇంటి దగ్గరే వున్న బళ్ళో చేర్పించాడు సిద్ధార్థ. "ఎందుకండీ, చక్కగా ఇద్దరు పిల్లల్ని కాన్వెంటులో చేర్చకుండా?" అని కుసుమ గోలపెట్టినా వినిపించుకోలేదతను. "తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితం పొందాలి. బుద్ధి దీపాల కింద చదువుకుని, వీధిలో ఎలక్ట్రిక్ దీపాల వెలుగులో చదువుకుని పెద్ద పెద్ద రాజకీయవేత్తలూ, శాస్త్రజ్ఞులూ అయినవారిని గురించి తెలుసుకుని వాళ్ళ అడుగుజాడల్లో నడపడానికి ప్రయత్నించాలిగానీ, గొప్పగా చచ్చేంత డబ్బు తగలేసి పెద్ద పెద్ద స్కూళ్ళల్లో చదువుకుని చివరికి గొర్రెతోక ఉద్యోగాల్లో చేరి చాలీచాలని సంపాదనతో బతకడంకాదు. అందుకే మన ఆదిత్యనీ, ఆనంద్‌నీ మామూలు వీధి బళ్ళో చేర్పించాను. వీళ్ళు డాక్టరూ, ఇంజనీయరూ అయి బోలెడు సంపాదించి....

అబ్బా "డబ్బు....డబ్బు....డబ్బు.... నోరు విప్పితే డబ్బు తప్ప మరోమాటలేదు." విసుక్కుంటూ వెళ్ళిపోయింది ఆమె.

అ తరువాత కొద్ది కాలానికే మళ్ళీ గర్భం దాల్చింది కుసుమ. భర్త మూర్ఖత్వానికీ, పశుత్వానికి ఆమె సిగ్గుతో కుంగిపోతుంది. ఆరోగ్యం కూడా దెబ్బతింది. మళ్ళీ కడుపులో బిడ్డ, ఏ బిడ్డో తెలుసుకోవడానికి పరీక్షకి తీసికెళ్ళాడు సిద్ధార్థ. మూగదానిలా నడిచింది కుసుమ, దడ దడలాడే గుండెని అర చేత్తో అదిమిపట్టుకుంటూ.

పరీక్షలో ఆమె గర్భంలో పెరుగుతున్నది మగబిడ్డ అని తేలింది. "హమ్మయ్య" అనుకుంది కుసుమ. ఎగిరి గంతేశాడు సిద్ధార్థ. అయితే డాక్టరు మాత్రం ఈసారి సిద్ధార్థని నానాతిట్లు తిట్టింది. కుసుమ ఆరోగ్యం ఏమీ బాగు లేదని, ఈసారి ఎలాగైనా గండం గడిచే మార్గం చూస్తాం కానీ మరోసారి గర్భవతైతే మాత్రం ఆమెను దక్కించుకోవడం సాధ్యంకాదని చెప్పి, ఆమెకు టానిక్కులూ, మందులూ రాసిచ్చింది. మరికొద్ది కాలానికే ఆమె పండులాంటి కొడుకుని కనింది.

చూస్తూ చూస్తూ కాలం తనలో పాతిక వసంతాలు నింపుకుంది. సిద్ధార్థ జీవితంలో అన్నీ అనుకున్నట్టుగానే సాగాయి. ఆదిత్య డాక్టరయ్యాడు. ఆనంద ఇంజనీరయ్యాడు. మూడోవాడు అమూల్య చార్‌టెడ్ అకౌంటెంట్ అయ్యాడు. అనేక సంబంధాలొస్తున్నాయి పిల్లలకి. మంచి కోడలు రావాలని కుసుమా,

మంచి కట్నం కావాలని సిద్ధార్థ ఎవరి దేముళ్ళకి వాళ్ళు మొక్కుకుంటున్నారు. తండ్రి చేసే బేరాలకి సిగ్గుపడుతున్నారు ఆదిత్యా, ఆనంద్, అమూల్యలు.

ఆనంద్ తన క్లాస్‌మేట్ వినతిని ప్రేమించానని చెప్పగానే ఉరిపెట్టి కోవడానికి సిద్ధమయ్యాడు సిద్ధార్థ, తండ్రి చావుతో తన పెళ్ళి ముడిపెట్టడం ఇష్టంలేని ఆనంద, వినతితో తెగతెంపులు చేసుకున్నాడు. వినతి వివాహం రవికాంత్‌తో జరిగిపోగా ఆనంద భీష్మ ప్రతిజ్ఞని తలచుకుంటూ అజన్మ బ్రహ్మచారిగా మిగిలిపోయాడు. సిద్ధార్థ రెండవకొడుకు ప్రవర్తన వల్ల అయిదు లక్షలు నష్టపోయానని కృంగిపోయాడు. కుసుమ ఆరోగ్యం కూడా పూర్తిగా చెడిపోయింది. పైగా కుసుమ అన్నయ్యకూతుర్ని కట్నం చాలదని సిద్ధార్థ చేసుకోకపోవడం, ఆమెను మరింత కించపరచింది.

ఆ అమ్మాయికి రాజేంద్రతో జరిగే పెళ్ళికి వెళ్ళడానికి మొహంలేక పిల్లల్ని వెళ్ళమంది. ఆదిత్య, అమూల్యలు వెళ్ళారు. అక్కడ వాళ్ళ మర్యాదలు చూసి, తండ్రి ప్రవర్తనకు మరింత సిగ్గుపడుతూ, తండ్రి తప్పుకి క్షమాపణగా తల్లిని సంతోషపెట్టడానికి, ఒకే మార్గం ఉందని గ్రహించి అతని రెండవ కూతురు మేఘనని అప్పటికప్పుడే మామయ్య అనుమతితో పెళ్ళాడి, అతనికి కొడుకులు లేకపోవడం వల్ల అతని ఇంటోనే ఇల్లరికం వుండిపోవడానికి ఒప్పు కున్నాడు అమూల్య. కుసుమ ఎంతగానో సంతోషించింది కొడుకు ప్రవర్తనకి. కాని సిద్ధార్థ మాత్రం మండిపడ్డాడు.

ఈ గొడవలు చూసి భరించలేని ఆదిత్య సౌదీ ఆరేబియా వెళ్ళిపోయాడు అవకాశం రాగానే అందుకుని. తన పెళ్ళి తనే తనకి నచ్చిన వారితో అక్కడే చేసుకుంటానని చెప్పి మరీ వెళ్ళిపోయాడు ఆదిత్య.

ముగ్గురూ మూడు పిట్టల్లా తలోదారి పట్టేసరికి పదిహేను లక్షలు పోవడమే గాదు, ముసలివయస్సులో సంపాదించిపెట్టే బిడ్డలు దగ్గరలేరని కుమిలిపోయాడు సిద్ధార్థ. తనకి భార్యా, ఆమెకి తనూ ఇద్దరే ఒకరికొకరు తోడుగా నీడల్లా మిగిలిపోయారు- పశ్చాత్తాపంతో కుమిలిపోతూ.

"ఏమండీ! డబ్బూ, డబ్బూ అన్నారే ఎందుకండీ డబ్బు మనకీ వయస్సులో? వాళ్ళకి అక్కర్లేదు. వాళ్ళ సంపాదన వాళ్ళకుంది. మీ డబ్బు దాహం మన బిడ్డలని మనకి దూరం చేసింది" అంది పిచ్చిగా శూన్యంలోకి చూస్తూ కుసుమ.

"చచ్చిన పాముని చంపకు కుసుమా! ధనం మూల మిదం జగత్ అనుకున్నానే కాని, డబ్బుతో కొనలేనిది, ఎక్కడా అరువుకైనా దొరకనిది మనిషి మమకారం అని తెలుసుకోలేకపోయాను" అన్నాడు దుఃఖాన్ని గొంతు లోనే అపుకుంటూ సిద్ధార్థ.

అతని వీపు నిమురుతూ, క్రాపు సవరించింది ఓదార్పుగా కుసుమ. గదిలో ఒక మూల గూడు కట్టుకుంటున్న పిట్టలు రెండూ గడ్డి దూదీ మోసుకొస్తూ కీచు కీచుమంటున్నాయి ఇద్దరూ అటుకేసి చూశారు.

"ఆడపిట్టని చూడండి కడుపుతోవుంది. గుడ్లు పెడుతుందేమో, గూడు కట్టుకుంటున్నాయి" అంది కుసుమ అటు చూపిస్తూ.

"అవును. ఆ గుడ్లు పిల్లలవుతాయి. వాటికి ఆహారం తెచ్చిపెడతాయి ఆడపిట్టా, మొగపిట్టా. రెక్కలొచ్చాక ఎగిరిపోతాయి పిల్లలు. ఏమి ఆశించి ఈ పిట్టలు ఆ గుడ్లకోసం గూడు కడుతున్నాయి? ఏమీ లేదు. అవి తన విధిగా అయా పన్లు చేసుకుపోతున్నాయి. కానీ మనిషో? తన పెళ్ళి దగ్గరి నుంచి, పిల్లల్ని కనడం, పెంచడం; మళ్ళీ వాళ్ళ పెళ్ళిళ్ళూ, అన్నీ వ్యాపారం గానే చూస్తున్నాడు" అన్నాడు సిద్ధార్థ బాధగా.

ఇద్దరూ అలా ఎంతసేపు ఆ పిచ్చుకల్నీ, పిచ్చుక గూడునీ చూస్తూ కూర్చున్నారో గదినిండా చీకట్లు ముసురుకుంటేగాని తెలీలేదు.

మెల్లగా లేచి వెళ్ళి కుసుమ గదిలో దీపం వేసింది, పిచ్చుక గూడు చూసి మురిసిపోతూ!

*